సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 27 । జనవరి । 2023





పేదల సంక్షేమం కోసం..

పేదల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎంపీ బీబీపాటిల్ పేర్కొన్నారు.

- 9లో ▸



వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

దోమకొండ మండలం సంఘమేశ్వర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.0 /18.4

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. చలితీవ్రత కొనసాగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

సొంత జిల్లాకు 42 మంది టీచర్లు!

- స్పౌజ్ కేసులో ప్రభుత్వ నిర్ణయం


సాక్షి, కామారెడ్డి: నిజామాబాద్ జిల్లా నుంచి 317 జీవో ద్వారా కామారెడ్డి జిల్లాకు బదిలీ అయిన వారిలో 42 మందిని స్పౌజ్ కేసులో భాగంగా తిరిగి సొంత జిల్లాకు పంపుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని పాత పదమూడు జిల్లాల్లో వేలాది మంది టీచర్లు సొంత జిల్లాకు పంపాలని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం స్పౌజ్ కేసులో మాత్రమే సొంత జిల్లాలకు పంపుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న 42 మంది నిజామాబాద్ జిల్లాకు వెళ్లే అవకాశం కలిగింది.

ఘనంగా వసంత పంచమి



కామారెడ్డి రూరల్/కామారెడ్డి టౌన్: వసంత పంచమి సందర్భంగా గురువారం కామా రెడ్డి పట్టణం ఇల్చిపూర్ శ్రీ సరస్వతి దేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్‌పటేల్, కొలల సిద్దాగౌడ్, రోండ్ల నారాయణరెడ్డి, మహేష్, రాములు పాల్గొన్నారు. శ్రీ శారదామాత ఆ లయంలో అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

'పోచారం' రెండో విడత నీటివిడుదల ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు నుంచి ఆయకట్టు భూములకు రెండో విడతగా గురువారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల 1న మొదటివిడతగా ప్రాజెక్టు నుంచి నీటివిడుదల చేపట్టిన అధికారులు ఈ నెల 14న నిలిపివేశారు. సుమారు 10రోజుల పాటు నీటి విడుదలను నిలిపివేసిన అనంతరం రెండో విడతగా గురువారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి 218 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. 15 రోజుల పాటు నీటి విడుదల కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

గడికోటలో సాంస్కృతిక మేళా



దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటలో గురువారం సాంస్కృతిక మేళా నిర్వహించారు. మేళాలో వివిధ రకాల వస్తువులను ప్రదర్శించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగు పద్ధతులు, చేనేత వస్త్రాలు, గాజు బొమ్మల ప్రదర్శన, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలతో పాటు, అందరికీ పౌష్టికాహారం, చేపల పెంపకం, తదితర వాటిపై మేళాలో ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శలను చేశారు. అంతకుముందు కోటలో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు వైభవాన్ని చాటేలా 'కళాభారతి'

సుభాష్‌నగర్ : నగరంలోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 'కళాభారతి' ఆడిటోరియం తుది నమూనాను గురువారం సీఎం కేసీఆర్ ఎంపిక చేశారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇందూరు వైభవాన్ని చాటేలా, ఇక్కడి సాంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టి పడేలా కళాభారతి నిర్మాణం చేపడ్తామన్నారు. రూ.50 కోట్లతో నిర్మించే కళాభారతి ఆడిటోరియానికి జనవరి 28న ఉదయం 11 గంటలకు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేస్తారన్నారు.

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి!

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పది నిమిషాల్లో ముగిసిన వేడుకలు
- కనీస ఏర్పాట్లు కూడా చేయని యంత్రాంగం



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన అదనపు కలెక్టర్లు, ఎస్పీ, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు



సాక్షి, కామారెడ్డి: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం పది గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎందరో త్యాగాల ఫలితంగా స్వాంతంత్ర్యం వచ్చిందన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటూ రాజ్యాంగ నిర్మాతను స్మరించుకోవాలన్నారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి అందరి సహకారం అవసరమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, చంద్రమోహన్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, శిక్షణా కలెక్టర్ శివేంద్ర పర్తాప్, అదనపు ఎస్పీ అన్యోన్య, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాజు, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, రాజంపేట జెడ్పీటీసీ కొండా హన్మాండ్లు, గాంధారి జెడ్పీటీసీ శంకర్‌నాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, కలెక్టరేట్ ఏవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుమని పది నిమిషాల్లో..

కరోనా సమయంలో సైతం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలు ఓ స్థాయిలో నిర్వహించారు. ఈ సారి కూడా వేడుకల నిర్వహణ కోసం కలెక్టర్ అధికారులతో పలుమార్లు రివ్యూలు నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ భవనంపై జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అంత సేపు అధికారులు, ప్రజాప్రతినిధులు నిలుచున్నారు. కలెక్టర్ రెండు మూడు నిమిషాలు మాట్లాడి ముగించారు. మొత్తంగా పది నిమిషాల్లో కార్యక్రమం ముగిసింది. అయితే పది నిమిషాల పాటైనా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా వేయలేదు. దీంతో అందరూ నిలబడే ఉండాల్సి వచ్చింది. కార్యక్రమం ముగియగానే ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

తర్వాత కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఏట్ హోం కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరయ్యారు.

ప్రశంసాపత్రాలకు నోచుకోని ఉద్యోగులు

స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందిని గుర్తించి సన్మానించడంతో పాటు ప్రశంసాపత్రం అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. పొరుగు జిల్లాల్లో అధికారులు, సిబ్బందిని సన్మానించి, ప్రశంసాపత్రాలు అందించారు. ఇక్కడ మాత్రం ప్రశంసా పత్రాలు ఏ ఒక్కరికీ అందించలేదు. ముందుగానే ఆయా శాఖల నుంచి ఉత్తమ సేవలందించే వారి వివరాలు సేకరించారు. కానీ గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి సభ నిర్వహించకపోవడం, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇవ్వకపోవడంతో నిరాశకు గురాయ్యారు. గణతంత్ర వేడుకలకు సరైన ఏర్పాట్లు చేయకపోవడం, ప్రశంసా పత్రాల విషయం పక్కన పెట్టడంపై హాజరైన అధికారులు, సిబ్బంది గుసగుసలాడారు.

క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరించిన కలెక్టర్

కలెక్టరేట్ ప్రాంగణంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పాటిల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్లు, కలెక్టర్ కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



గౌరవ వందనం చేస్తున్న పోలీసు సిబ్బంది



వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎట్‌హోంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రభుత్వాల దురాగతాలపై చార్జ్‌షీట్



జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- కేసీఆర్ పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారింది
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నాయని, ఈ ప్రభుత్వాల దురాగతాలపై చార్జ్‌షీట్ విడుదల చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. దేశ వ్యాప్తంగా భారత్ జోడో, హాత్‌సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో దేశ, రాష్ట్ర ప్రజల బాధలను, కష్టాలను పంచుకున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం 'హాత్‌సే హాత్ జోడో యాత్ర'లో భాగంగా గాంధీనగర్ నుంచి ఇంద్రానగర్ కాలనీ వరకు పాదయాత్ర చేపట్టారు. స్థానిక ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంద్రనగర్, రాజీవ్ నగర్ కాలనీల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కొనసాగింపుగా హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించి భారత్ జోడో యాత్ర విశేషాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు పాలనపై భారత్ జోడో యాత్రలో దేశ పరిస్థితిపై వాస్తవ క్షేత్ర ప్రభావ అధ్యయనం చేశామన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. అభయ హస్తం, స్త్రీనిధి, మహిళా సంఘాల రుణాలకు సంబంధించి వడ్డీ రాయితీ డబ్బుల విడుదల కోసం, పోరాటం చేస్తామన్నారు. పేద ప్రజలపై విద్యుత్ బిల్లులపై ఏసీడీ చార్జీలతో నడ్డి విరుస్తున్నారన్నారు. ఇప్పటికే బస్సు చార్జీలు, ఆస్తి పన్ను, రిజిస్ట్రేషన్లు ఇలా ఎన్నో ధరలను పెంచి పేదలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలను తీరుస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం, కాసుల బాలరాజు, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, పండ్ల రాజు, ఐరెని సందీప్ పాల్గొన్నారు.

టీచర్ల బదిలీ మార్గదర్శకాలు జారీ!

- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నెలరోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- బదిలీ, ప్రమోషన్లపై ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ



సాక్షి, కామారెడ్డి: ఉపాధ్యాయులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీలు, ప్రమోషన్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రక్రియ చేపట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ జీవో నం. 5 ద్వారా మార్గదర్శకాలను జారీ చేసింది. నెల రోజుల పాటు ప్రక్రియ కొనసాగనుంది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు మూడు రోజుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మార్చి 4 వరకు మొత్తం ప్రక్రియ పూర్తిచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లాలో 1,011 పాఠశాలల్లో 4,938 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 4,078 మంది పనిచేస్తున్నారు. 860 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడతారు. కాగా కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను ఈ నెల 27న డీఈవో కార్యాలయాల్లో డిస్‌ప్లే చేస్తారు. 28 నుంచి 30 వరకు బదిలీ అప్లికేషన్లు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు హార్డ్ కాపీని ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2 వరకు అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ హార్డ్ కాపీని, ఇతర వివరాలను వారు పనిచేస్తున్న హెడ్‌మాస్టర్‌కు అప్పగించాలి. ప్రాథమి, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌కు అందజేయాలి. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ బదిలీ కోసం చేసుకున్న దరఖాస్తు హార్డ్ కాపీలను డీఈవోకు అందించాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల నుంచి స్వీకరించిన హార్డ్ కాపీలను ఫిబ్రవరి 3 నుంచి 6 లోపు సంబంధిత హెచ్ఎంలు డీఈవోకు అప్పగించాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన తరువాత 7 నుంచి 8 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జాబితాను డిస్‌ప్లే చేయాల్సి ఉంటుంది. ఏవైనా అభ్యంతరాలుంటే అదే సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయాలి. 8 నుంచి 10 వరకు అభ్యంతరాలను అధికారులు పరిశీలిస్తారు. 11 నుంచి 12 తేదీల్లో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఫైనల్ సీనియారిటీ లిస్ట్‌ను ప్రదర్శిస్తారు. ఆ తర్వాత సీనియారిటీ ఆధారంగా వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తారు. వాటికి సంబంధించిన షెడ్యూల్ కూడా ఇదే జీవోలో పేర్కొన్నారు. 14న హెడ్‌మాస్టర్ల బదిలీ ఉత్తర్వులు జారీ అవుతాయి. బదిలీల తర్వాత ఖాళీల వివరాలను ప్రకటిస్తారు. 16, 17, 18 తేదీల్లో సీనియారిటీ ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లకు హెడ్‌మాస్టర్లుగా ప్రమోషన్లు కల్పిస్తారు. 19, 20 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల ప్రకటన వెలువడుతుంది. 22, 23 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు వెలువడతాయి. 24న స్కూల్‌అసిస్టెంట్ ఖాళీల వివరాలు ప్రదర్శిస్తారు. 25 నుంచి 27 వరకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పిస్తారు. తర్వాత 28న, మార్చి 1, 2 తేదీల్లో ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల ప్రకటన విడుదల చేస్తారు. 3న ఆప్షన్లను సవరించుకునే అవకాశం కల్పించి, 4న బదిలీ ఆర్డర్లు జారీ చేస్తారు. దీంతో ఉపాధ్యాయుల బదిలీ, ప్రమోషన్ల ప్రక్రియ ముగియనుంది. నెలరోజుల పాటు జరిగే ప్రక్రియతో ఉపాధ్యాయులంతా కార్యాలయాల చుట్టూ తిరుగున్నారు. విద్యార్థులకు పరీక్షల సీజన్‌లో బదిలీ, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని భావిస్తున్నారు.

పౌష్టికాహారంపై అనాసక్తి!

- రాష్ట్రంలో అట్టడుగున కామారెడ్డి జిల్లా
- తెలంగాణ గణాంక నివేదిక-2022 వెల్లడి
- సరైన పర్యవేక్షణ లేకే ఈ పరిస్థితి



సాక్షి, కామారెడ్డి: పౌష్టికాహార లోపంతో రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్న తల్లులు, పిల్లలకు పోషక పదార్థాలు(న్యూట్రిషన్ సప్లిమెంట్స్) అందిస్తుండగా జిల్లాలో తల్లులు, పిల్లలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పోషకాలు తీసుకోవడంలో కామారెడ్డి జిల్లా అట్టడుగున ఉండడం గమనార్హం. మహిళా, శిశు సంక్షేమశాఖలో సరైన అజమాయిషీ లోపించడమే కారణమని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన తెలంగాణ స్టాటిస్టిక్స్ అబ్‌స్ట్రాక్ట్-2022 నివేదికలో పోషక పదార్థాలు అత్యల్పంగా తీసుకుంటున్న జిల్లాగా కామారెడ్డిని పేర్కొనడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. 2021-22 సంవత్సరంలో పౌష్టికాహార లోపం ఉన్న తల్లులు 16,191 మందిని గుర్తించి పోషక పదార్థాల అందించేందుకు వారి పేర్లను నమోదు చేశారు. అయితే 4,361 మంది మాత్రమే పోషకాలు పొందుతున్నట్లు నివేదిక వెల్లడించింది. అంటే కేవలం 26.9 శాతం మంది తల్లులు మాత్రమే పోషకాలు తీసుకుంటున్నారని స్పష్టమవుతోంది. అలాగే అదే సంవత్సరం ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు వయస్సు ఉన్న పిల్లల్లో 69,443 మంది పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి వారికి అదనపు పోషకాహారం అందించేందుకు నమోదు చేసుకున్నారు. వారిలో కేవలం 14,523 మంది మాత్రమే పోషక పదార్థాలు తీసుకుంటున్నారు. కేవలం 20.9 శాతం మంది పిల్లలు మాత్రమే అదనపు పోషకాలు తీసుకుంటున్నట్లు నివేదిక వెల్లడించింది.

ఇలాగైతే రక్తహీనత సమస్యను అధిగమించడం కష్టమే!

ప్రభుత్వం తల్లి, బిడ్డ ఆరోగ్యం కోసం అనేక పథకాలు తీసుకువస్తున్నా రక్తహీనత సమస్య మాత్రం దూరంకావడం లేదు. జిల్లాలో రక్తహీనత సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా తల్లులు, పిల్లల్లో రక్తహీనత సమస్యను అధిగమిచేందుకు పోషక పదార్థాలు(న్యూట్రిషన్ సప్లిమెంట్స్) అందిస్తున్నా తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. పోషక పదార్థాలు తల్లులు, బిడ్డలు తీసుకునేలా సరైన పర్యవేక్షణ లేకపోవడం మూలంగా వారి దరిచేరడం లేదు. రక్తహీనత సమస్య నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రభుత్వం గర్భిణులకు 'కేసీఆర్ న్యూట్రిషన్ కిట్' పథకాన్ని తీసుకువచ్చింది. గర్భిణులు రక్తహీనత సమస్యతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్న తొమ్మిది జిల్లాల్లో ప్రారంభించారు. తొమ్మిది జిల్లాల్లో కామారెడ్డి ఒకటి. గర్భిణులకు ఆరోగ్య సిబ్బంది ద్వారా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందించడం మూలంగా వారికి చేరతాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తల్లులు, పిల్లలు అదనపు పోషకాహారం తీసుకోవాలంటే మాత్రం ముందుకు రావడం లేదు. తల్లులు, పిల్లలకు న్యూట్రిషన్ కిట్ అందిస్తేగానీ రక్తహీనత సమస్యను అధిగమించే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రత్యేక దృష్టి సారించాల్సిందే!

పోషకాహార లోపం ఉన్న తల్లులు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషక పదార్థాలు తీసుకునే విధంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పనిభారం పెరిగిన నేపథ్యంలో వారు ఇల్లిల్లు తిరిగి తల్లులు, పిల్లలను రప్పించే పరిస్థితి లేకుండాపోయింది. పోషక పదార్థాలు తీసుకుంటున్న వారిలో కామారెడ్డి జిల్లా అట్టడుగున ఉంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, అమలులోనూ అనేక సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో తల్లులు, పిల్లలు ఆసక్తి చూపడం లేదని స్పష్టమవుతోంది. రాష్ట్ర గణాంక నివేదికను చూసిన తర్వాత అయినా జిల్లా యంత్రాంగం రక్తహీనత సమస్యను అధిగమిచండం కోసం అదనపు పోషకాలు అందించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

3లోపు డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి సంవత్సరం 1వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును ఫిబ్రవరి 3లోపు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 4వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు.

6లోపు పీజీ పరీక్ష ఫీజు..

తెలంగాణ యూనివర్సిటీలో పీజీ (రెండు సంవత్సరాలు), ఇంటిగ్రేటెడ్ పీజీ (ఐదు సంవత్సరాలు) కోర్సుల 3వ, 5వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్ష ఫీజును ఫిబ్రవరి 6లోపు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ కోర్సుల సబ్జెక్టులకు రూ.500లు, ఎంబీఏ, ఐఎంబీఏ, ఎంసీఏ కోర్సుల సబ్జెక్టులకు రూ.800లు, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ అప్లయిడ్ ఎకనామిక్స్ కోర్సుల సబ్జెక్టులకు రూ.600ల చొప్పున ఫీజు చెల్లించాలన్నారు. అలాగే రూ.100అపరాధ రుసుముతో 13వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే మొదటి సెమిస్టర్స్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల ఫీజును 6లోపు, రూ.100 అపరాధ రుసుంతో 13వరకు చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని తెయూ పరిధిలోని అన్ని అనుబంధ పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు గమనించాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు తెలంగాణ యూనివర్సిటి వెబ్‌సైట్ www. telanganauniversity. ac. inను సందర్శించాలని సూచించారు.

పీపీకి ప్రశంసాపత్రం అందజేత



పీపీ రవిరాజ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసికూటర్ పిడుగు రవిరాజ్ గురువారం హైకోర్టు జడ్జి విజయసేన్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. హైదరాబాద్ లో రాష్ట్రస్థాయి పబ్లిక్ ప్రాసికూటర్ల సమావేశం నిర్వహించగా, విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రవిరాజ్ ప్రశంసాపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

నవీపేట: నవీపేట శివారులోని బాసర రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. నవీపేట నుంచి బాసర వైపు వెళ్తున్న కారును ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. రెండు కార్ల ముందు భాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కార్లలో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకెలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డిలోని ఎన్జీవోస్ కాలనీలో ఇటీవల జరిగిన వాషింగ్ మిషన్ పేలుడు ఘటనలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడగా.. గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా.. కాలనీకి చెందిన రాజూరి బాలయ్య(75) ఇంట్లో ఈ నెల 20న సాయంత్రం వాషింగ్ మిషన్ పేలింది. ఈప్రమాదంలో బాలయ్య, అతడి భార్య తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారికి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బాలయ్య మృతిచెందాడు.

ఘనంగా గణతంత్ర వేడుకలు

కామారెడ్డి జిల్లాలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌తోపాటు అన్ని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. –సాక్షి నెట్‌వర్క్



కలెక్టరేట్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



క్యాంపు కార్యాలయంలో జెండావందనం చేస్తున్న కలెక్టర్..



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ పాటిల్





అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ శోభ.. నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్



ఎస్పీ కార్యాయలంలో జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ అన్యోన్య



జిల్లా పరిషత్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈవో సాయాగౌడ్



సలాబత్‌పూర్‌లో జెండాకు వందనం చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్



మద్నూర్‌లో మహాత్ముల వేషధారణలో విద్యార్థులు



కలెక్టరేట్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు







కామారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయం ఎదుట జెండావిష్కరణలో పాల్గొన్న పార్టీ నేతలు.. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట.. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట..



కామారెడ్డిలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో..



కామారెడ్డిలోని టీఎన్జీవోస్ భవన్‌లో..



కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో..



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట..



జిల్లా గ్రంథాలయంలో..



నిజామాబాద్ నగర కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో..



నిజామాబాద్ కోర్టు ప్రాంగణంలో..



నిజామాబాద్ కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవాలకు హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు



కలెక్టరేట్‌లో సిబ్బందిని పలకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి





నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో..



బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో..

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఒకరు మెదక్ జిల్లాకు చెందగా, ఒకరు నిజామాబాద్ జిల్లాకు చెందినవారు ఉన్నారు. మరొకరు గుర్తుతెలియని వ్యక్తి.

మోపెడ్‌ను ఢీకొన్న లారీ ఘటనలో..



లింగం మృతదేహం

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం మోపెడ్‌ను ఓ లారీ ఢీకొట్టింది. ఈఘటనలో మెదక్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నార్లపూర్‌కు చెందిన బోంది లింగం(45) తన భార్య లలితతో కలిసి, తన మోపెడ్‌పై గురువారం భిక్కనూరుకు బయలుదేరాడు. భిక్కనూరు చర్చి సమీపంలో వారు జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వస్తుండగా కామారెడ్డి వైపు నుంచి హైదారాబాద్ వైపు వెళ్తున్న లారీ, మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో లింగం అక్కడికక్కడే మృతి చెందగా, లలితకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని, మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ ఘటనలో..

ఖలీల్‌వాడి: నగర పరిధిలోని సారంగపూర్ వద్ద బైక్‌ను ఓ లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన రమేష్ (27) బైక్‌పై సొంతూరికి వెళుతుండగా సారంగపూర్ వద్ద లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని అర్సపల్లి శివారులో రైలు నుంచి కింద పడి గుర్తుతెలియని ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ప్రణయ్ గురువారం తెలిపారు. యువకుడు రైలులో వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుందని ఆయన పేర్కొన్నారు. మృతుడికి సుమారు 25ఏళ్ల వయసు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువకుడి వివరాల కోసం రైల్వే పోలీసులను ఆశ్రయించాలన్నారు.

నిజామాబాద్ వెటర్నరీ ఏడీ ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం హన్మకొండ
- పోలీసులకు లభ్యమైన సూసైడ్‌నోట్



శ్రీశైలం మృతదేహం

ఖలీల్‌వాడి: నగర పరిధిలోగల సారంగపూర్ డెయిరీఫాంలోని డిస్ట్రిక్ లైవ్‌స్టాక్ డైయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి నిజామాబాద్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దకాసుల శ్రీశైలం(52) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. శ్రీశైలం హన్మకొండకు చెందినవారు. గత ఏడాది ఆయన వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఏడీగా బదిలీపై వచ్చారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఆయన హన్మకొండలోని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి అందరు మంచిగా ఉండాలని తెలిపారు. తండ్రి మాటల్లో తేడాలు రావడంతో కొడుకులు వెంటనే నిజామాబాద్ వచ్చారు. శ్రీశైలం గదికి గడియ ఉండటంతో తలుపులు తొలిగించి తెరిచేసరికి ఆయన ఉరివేసుకొని ఉన్నారు. ఏడీ చనిపోయే ముందు సూసైడ్‌నోట్ రాసుకున్నట్లు తెలిపారు. ఈ లెటర్‌లో నా చావుకు ఎవరు కారణం కాదని ఏడీ రాసినట్లు తెలిపారు. కానీ సూసైడ్ నోట్‌ను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడారా? లేదా ఆర్థిక కారణాలు, ఇతర సంబంధాలతో ఆత్మహత్యకు పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబసభ్యులు హన్మకొండకు తరలించారు.

అనారోగ్యంతో మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కద్దూరం పోసాని(55) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఆమె జీవితంపై విరక్తి చెంది, ఇంటో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.